# బంధనాల స్వభావాన్ని చిత్రించే “స్వేచ్ఛ”

~ శ్రీశాంతి దుగ్గిరాల



**సమీక్ష:** బంధనాల స్వభావాన్ని చిత్రించే స్వేచ్ఛ

**రచన:** శ్రీశాంతి దుగ్గిరాల

ప్రచురణ: కినిగె పత్రిక http://patrika.kinige.com

కాలం: డిసెంబరు 2013

శాశ్వత లింకు : http://patrika.kinige.com/?p=355

©Author.
**What can you do with this document?**
Read it!
Store this PDF on your device.
Share the link with your friends
Share this PDF with your friends via personal communication (e.g. email)
Take printouts for personal use
**What is not allowed by Owner of this document?**
Editing the document. No page to be removed or added.
Distributing to public (instead kindly share the link to Kinige given above)

## బంధనాల స్వభావాన్ని చిత్రించే "స్వేచ్ఛ"

ఈ పుస్తకానికి రాసిన పరిచయంలో రచయిత ఓల్గా స్వేచ్ఛ గురించి ఇలా అంటారు:

> ఈ స్వేచ్ఛ ఎవరో ఒకరు ఇచ్చేది కాదు. ఎవరి దగ్గర నుండి సాధించుకునేది కాదు. మన అవసరాలను, మన ఉనికికి అత్యవసరమైన విషయాలను మనం గుర్తించడమే స్వేచ్ఛ. నిజానికి ఇది సాధించడమే చాలా కష్టం. మన నుండి మనకు స్వేచ్ఛ. మనకు పుట్టుక నుండీ అలవాటైన భావాల నుండీ అభిప్రాయాల నుండీ ఆచారాల నుండీ స్వేచ్ఛ. మనలో జీర్ణించుకు పోయిన నమ్మకాల నుండీ విడుదల.

అరుణ ఎమ్మే ఆఖరి సంవత్సరం పరిక్షలు రాసింది. మధ్యతరగతి కుటుబంలో పుట్టి పెరిగిన ఆమె చిన్న నాటి నుండి అదుపాజ్ఞలతో పెరిగింది. వయసు రాగానే తండ్రీ, అన్నగారూ అరుణకు హద్దులు నిర్ణయించేవారు.

దీనికి కొంత కారణం అరుణ మేనత్త కనకమ్మ, భర్త చిన్నవయసులోనే చనిపోవడంతో తమ్ముడి (అరుణ తండ్రి) ఇంటికి కొంత ఆస్తితో చేరింది. వయసులో జరగాల్సిన ముచ్చటలేమీ జరగని కనకమ్మ తమ్ముని భార్య సీతమ్మ పైన, ఆ ఇంటివారి పైన తన పెత్తనాన్ని, కసినీ వెళ్ళగక్కుతూ ఉంటుంది. ఆమె ఆస్తి మీద ఆశతో ఎవరూ మారు మాట్లాడేవారుకాదు. ముఖ్యంగా అరుణను అనుక్షణం అణిచి వేయాలని చూసేది. అరుణ అక్కను 15 సంవత్సరాలకే పెళ్ళి చేసి పంపినట్లే అరుణను కూడా పంపాలని ఆమె ఆలోచన. అక్కకు మనవరాలు పుట్టినా ఇంకా చెల్లెలికి పెళ్ళి చేయలేదని తమ్ముడిని పోరేది. ఈ అణిచివేతను, ఆంక్షలనూ అరుణ చిన్న వయసు నుండీ మనసులోనే వ్యతిరేకిస్తూ ఉండేది.

ఇలాంటి కుటుంబంలో అరుణ ఆ మాత్రమైనా చదువుకోవటానికి కారణం తండ్రి జానకి రామయ్య దగ్గర పెళ్ళి చేయడానికి తగిన డబ్బు లేకపోవడమే, లేదంటే ఏనాడో పెళ్ళి చేసి గుండెల మీద భారాన్ని దింపుకునే వాడు.

ఆర్థిక స్వాతంత్రం కోసం ఉద్యోగం సంపాదించి, తాను ప్రేమించిన ప్రకాశాన్ని పెళ్ళాడితే తనకు స్వేచ్ఛ లభిస్తుందని అరుణ ఆలోచన. ఉద్యోగం రాగానే ప్రకాశాన్ని వివాహం చేసుకుంటుంది. అప్పుడే పిల్లలు వద్దన్నా ప్రకాశం వినిపించుకోడు, మొండి వైఖరితో అనుకున్నది

సాధిస్తాడు. అతనికి మొదట్నుంచీ అరుణ ఉద్యోగం చేయటమూ, స్వతంత్రించి ఆర్థిక నిర్ణయాలు తీసుకొవటమూ పెద్దగా నచ్చదు. అరుణ ఉద్యోగం చేస్తూనే కుటుంబ భాధ్యతలనూ సమర్థంగా నిర్వహిస్తున్నా ప్రకాశం ఆమెను తన మాటలతో బాధ పెడుతుంటాడు. ఆమె కాలేజీలో పూర్తి జీతం కోసం సమ్మెలు చేయడం, అభ్యుదయ పత్రికకు పని చేయడం, అందుకోసం నలుగురిలోనూ తిరగడం, మెహందీ మహిళల్ని ఇంటర్వ్యూ చేయడం, ఇవన్నీ చూసి అతనిలో వ్యతిరేకత పెరుగుతుంది. తన భార్య పూర్తిగా ఇంటి బాధ్యతలకే పరిమితం కావలన్నది అతని అభిప్రాయం. సమాజంలో జరిగే విషయాలన్నీ నెత్తి మీదకు వేసుకోవద్దంటాడు. చివరకు సంసారం కావాలో, సమాజ సేవ కావాలో తేల్చుకోమంటాడు.

ప్రకాశం మనస్తత్వం లోని మార్పును, మాటలతో అవమానించే తీరును అరుణ సహించలేకపోతుంది. చుట్టూ స్త్రీలంతా పైకి ఎలా ఉన్నా తనలాంటి సమస్యలతోనే సతమతవుతున్నారని అరుణ నెమ్మదిగా గ్రహిస్తుంది. చివరకు పైకి ఎంతో అభ్యుదయవాదిలా కనిపిస్తూ సమాజ చైతన్యం అంటూ కబుర్లు చెప్పే తోటి ఉద్యోగి కేశవరావు సొంత ఇంటిలో మాత్రం భార్యను కట్టు బానిసలా వంటింటికే పరిమితం చేయటాన్ని చూసి భరించలేకపోతుంది.

బంధనాల స్వభావం తెలిసే కొద్దీ అరుణకు స్వేచ్ఛ స్వరూపం కూడా అర్థమవుతుంది. చివరకు బంధాల నుండి విముక్తురాలు కావాలన్న నిర్ణయానికి వస్తుంది. తనకు చేతనైనంత వరకు సమాజానికి, తోటి ఆడవారికి సాయపడాలనే ఆలోచనకు వస్తుంది.

**నా అభిప్రాయం:—**

స్వేచ్ఛ ఇది ఒకరు ఇచ్చేదికాదు, ఒకర్నుంచి పుచ్చుకునేదీ కాదు. ప్రతీ స్త్రీ తన మనుగడకు తాను స్వతంత్రంగా జీవించడానికి చేసే పోరాటమే స్వేచ్ఛ. కాలం మారిందంటారు గానీ స్త్రీలు ఇప్పటికీ బంధితులే. ఆ బంధనాల స్వభావం మారిందంతే.

ఒకప్పుడు తల్లిదండ్రులు అమ్మాయిలకు బాల్యంలో ఎంత స్వేచ్ఛ ఇచ్చినా వయసుకు రాగానే ఆమెను కట్టడిలో పెట్టేవారు. చూసే చూపు, మాట్లాడే తీరు, నడక, నడత అన్నింటిలోనూ లేని పెద్దరికాన్ని తెచ్చిపెట్టేవారు. ఇంటి పరువు, ప్రతిష్టా నీ చేతల్లోనే ఉన్నాయనేవారు. తోబుట్టువుల భవిష్యత్తు నీ నడవడిక మీదే ఆధారపడిందనేవారు. ఆమె ఆ మాటలనే వేదంగా పాటించేది. తనకు తాను హద్దులను ఏర్పరుచుకునేది. ఈ స్త్రీలకు చదువు కూడా ఒక సమస్యే.

అలా స్వేచ్ఛ లేని జీవితంలోనే పుట్టి పెరిగి, పెళ్ళి, సంసారం, భర్త, పిల్లలు, అత్త, మామా, బంధువర్గం అంటూ బంధాల వలయంలో చిక్కుకునేది. కుటుంబ భాధ్యతలు, పిల్లల పెంపకంలో పడి ఎన్నడూ తన అభిప్రాయాలను, ఆలోచనలనూ బయట పెట్టే వీలుండేది కాదు. ఆఖరు నిముషం వరకూ ఆ పరిధిలోనే జీవించేది. ఆ ప్రపంచంలోనే తనువు చాలించేది.

ఆ కట్టుబాట్లు దాటాలనిగానీ, తన సమస్య పై పోరాడాలని గానీ ఆమెకు ఆలోచన లేదు. తాను అణిచివేతకు, గృహహింసకూ గురి అవుతున్నా ధైర్యం చేయదు సరి కదా, సాటి స్త్రీ ఎవరన్నా ఆ సమస్య పై పోరాడుతుంటే చులకనగా చూస్తుంది.

నేటి స్త్రీ జీవితం పైకి ఇందుకు భిన్నంగా కనిపించినా, అంతర్లీనంగా ఆమెకుండే బంధనాలు ఆమెకూ ఉన్నాయి. ఆమె చదువు వల్ల వచ్చిన వివేకమూ విజ్ఞానమూ ఉన్నాయి. ఉద్యోగంలో ఉన్నతమైన పదవి, ఆర్థిక స్వాతంత్రమూ ఉంది. స్వతంత్రించి నిర్ణయాలు తీసుకోగలదు. సమాజానికి సేవచేయాలనే అభ్యుదయ భావాలు కూడా లోపల ఉంటాయి. అయినా ఆమె కూడా కుటుంబానికీ, భర్తకూ లోబడే నడుచుకుంటుంది.

ఇలాంటి కనపడని బంధనాల్ని చిత్రిస్తుందీ నవల. ఇది 1987లో రాసిన నవల. ఈ పాతికేళ్లలో కొంతలో కొంత మార్పు వచ్చింది. స్త్రీ మగవానితో సమానంగా అన్ని రంగాలలోనూ రాణిస్తోంది. సమాజంలో స్త్రీ మీద జరుగుతున్న అరాచకాలను ధైర్యంగా ఎదుర్కొంటుంది. సాటి స్త్రీ కి అన్యాయం జరిగితే మహిళా సంఘాల ద్వారా నిరసనల ద్వారా పోరాడుతుంది. మీడియా సహకారాన్ని తీసుకుంటుంది. ఒకప్పుడు చదువున్నా కుటుంబానికే పరిమితమై అణిచివేతనూ, గృహహింసనూ, మౌనంగా భరించిన స్త్రీ నేడు తనను తాను ప్రశ్నించుకుంటుంది, తాను ఎందుకు భరించాలంటూ సమాజాన్ని ప్రశ్నిస్తుంది.

జీవితంలో మోసపోయిన మహిళ తన సమస్యల పై ధైర్యంగా పోరాడ గలిగిన రోజున వరకట్నచావులు, బలవన్మరణాలూ ఉండవు. ఓల్గా గారి మాటల్లో చెప్పాలంటే:

ఇంట్లో అణిగి మణిగి పరాధీనగా ఉన్న స్త్రీ, ఉద్యోగంలో ధైర్యంగా, నైపుణ్యంగల దానిగా, పట్టుదలతో లక్ష్యం సాధించేదానిలా, తెలివితో బాధ్యతతో ప్రవర్తించాలి. ఉద్యోగంలో,

సమాజంలో ఇంత తెలివిగా బాధ్యతగా ప్రవర్తించటం నేర్చుకున్న స్త్రీ ఆ తెలివినీ బాధ్యతనూ ఇంటికి కూడా తీసుకువస్తుంది.

మగవాడు కూడా తాను స్త్రీ కన్నా అధికుడననే భావనను వదిలి పెట్టి సమదృష్టితో ఆలోచించి అర్థం చేసుకున్ననాడు, భార్యాభర్తలకు ఒకరిపై ఒకరికి నమ్మకం ఉన్ననాడు, ఒకరి అభిప్రాయాలను ఒకరు గౌరవించిన నాడు, వారి మధ్య గొడవలూ కీచులాటలూ పెరగవు. సమస్య ముదిరి విడాకుల వరకూ రాదు.

~ దుగ్గిరాల శ్రీశాంతి

ప్రాప్తి: ఈ-బుక్ – కినిగెలో ; వెల: 54/-

For Latest Telugu Books - Visit now:
Kinige.com